

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 275 ఎడిటర్: కె.యువరాజ్ గురువారం 16-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్ధిక
శుభాకాంక్షలు


## ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్‌కు ప్రముఖుల ఆహ్వానం

### జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ బాబా శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్



**హైదరాబాద్, జులై 15 (వన్‌నేషన్):** ఈనెల 17 నుంచి 19 తేదీ వరకు బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్ హైదరాబాద్ లో జరగనుంది. బాగేశ్వర్ బాబా ధీరేంద్ర శాస్త్రి శ్రీ హనుమాన్ కథ కార్య క్రమానికి హాజరు కావాలని హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి సభ్యులు బుధవారం పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రసాద్ శుక్లా తో పాటు ముఖ్యమంత్రి ఎనుముల. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తదితరులకు ఆహ్వాన పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అంజనీ కుమార్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, రాకేష్ జలన్, నవీన్ అగర్వాల్, అంజన్ సరోగి, సందీప్ కుమార్ అగర్వాల్, సంష్‌దీప్ అగర్వాల్, సంష్‌దీప్ అగర్వాల్, కమల్ అగర్వాల్, కమల్ అగర్వాల్, జి. బాగేశ్వర్ ధామ్ సేవా సమితికి చెందిన పవన్ తిబ్రేవాల్, జస్మత్ పటేల్, రిదీష్ జాగీర్దార్ తదితరులు పాల్గొన్నారు.



మూడు రోజుల కార్యక్రమం : జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తుల కోసం మూడు రోజుల పాటు శ్రీ హనుమాన్ కథ ఉంటుంది. హైదరాబాద్‌లో తొలిసారి శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలు జూలై 17, 18, 19 తేదీల్లో గగన్ పహాడ్‌లోని పురాన్ సన్స్ ఫార్మ్స్ (ప్రెస్టీజ్ సిటీ

3లో

## చంద్రబాబుకు ఊరట!

### - రాజధాని అసైన్డ్ భూముల కేసును కొట్టివేసిన హైకోర్టు

**అమరావతి, జులై 15 (వన్‌నేషన్):** రాజధాని అసైన్డ్ భూములకు సంబంధించి జీవో జారీ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక మంత్రి పి.నారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. అమరావతి అసైన్డ్ భూముల విషయంలో వారిపై సీఐడీ గతంలో నమోదు చేసిన కేసును కొట్టివేసింది. న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు బుధవారం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించారు. రాజధాని అసైన్డ్ భూముల విషయంలో అసైన్డ్ నిబంధనలకు విరుద్ధంగా 2016 ఫిబ్రవరి 17న జీవో 41 జారీ చేసి పలు అక్రమాలు జరగడానికి కారణమయ్యారనే ఆరోపణలతో వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి 2021 ఫిబ్రవరి 24న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, పి.నారాయణపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంతో పాటు ఏపీ అసైన్డ్ భూముల బదిలీ నిరోధక చట్టం, ఐపీసీలోని పలు సెక్షన్ల కింద సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వారిద్దరూ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. 2021 మార్చి 19న వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయస్థానం.. కేసులో తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యాజ్యాలపై ఇటీవల తుది విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అసైన్డ్ రైతులకు మేలు



చేయాలన్న సదుద్దేశంతోనే జీవో 41 తీసుకొచ్చారని, ఈ ఉత్తర్వుల జారీ ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని తెలిపారు. సీఐడీ అధికారులు వేరే కేసులో సేకరించిన వివరాలను ప్రస్తుత కేసుకు జత చేసి న్యాయ విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేశారని.. వేరే కేసులో ఉన్న ఆధారాలను ఈ కేసులోని నిందితులకు అన్వయించడానికి వీల్లేదని తెలిపారు. 'జీవో జారీ చేసిన ఐదేళ్ల తర్వాత దానిని తప్పుబడుతూ దురుద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయడానికి బాధితులెవరూ నేరుగా ఫిర్యాదు చేయలేదు. జీవో 41 జారీలో ఎంతో మంది అధికారులకు ప్రమేయం ఉంది.

వారెవరినీ నిందితులుగా చేర్చలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా జీవో 41ని పూర్తిగా రద్దు చేయలేదు. అందులోని ఒక్క క్లాజ్‌ను మాత్రమే సవరించారు' అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

## ఈనెల18న జరగనున్న యువ సంగ్రామ సదస్సు



**హైదరాబాద్, జులై 15 (వన్‌నేషన్):** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా యువతకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని మాజీమంత్రి, అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ విమర్శించారు. సరూర్ నగర్ స్టేడియంలో ఈనెల18న జరగనున్న యువ సంగ్రామ సదస్సు ఏర్పాట్లను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ లు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే లు సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, భండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పలువురు సీనియర్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నీరు, నిధులు, నియామకాలు అనే నినాదంతో కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ ప్రభుత్వం2 లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని, మరికొన్ని ఉద్యోగాల భర్తీ వివిధ కారణాలతో పెండింగ్ లో ఉండిపోయాయని చెప్పారు. 2023 ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాల నియామకాలు చేపడతామని, ఉద్యోగం వచ్చే వరకు ప్రతినెలా 4 వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఉద్యోగాల కోసం యువత ఆందోళనలు చేపడితే అక్రమంగా అరెస్ట్ లు చేయడం, లాఠీచార్జి చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై యువతకు నమ్మకం పోయిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ నెల 18 వ జరిగే సభకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిధిగా హాజరవుతారని, యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.



## నేటి నుంచే బోనాలు

### - ఉత్సవాలకు రూ.20 కోట్లు! - నగరంలో 3వేల ఆలయాల్లో ఘనంగా నిర్వహణ - ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు: సీఎం రేవంత్



**హైదరాబాద్, జులై 15 (వన్‌నేషన్):** డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ సంప్రదాయ వస్త్రాల్లో మహిళలు ఎంతో భక్తిప్రపత్తులతో బోనాలెత్తుకొని ఆలయాలకు కదిలే తరుణం వచ్చేసింది! మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ పండుగ సందర్భంగా జంట నగరాలకు చెందిన భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ బోనాల పండుగ కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని, ఈ ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవం అని సీఎం అభివర్ణించారు. జంట నగరాల పరిధిలో జరిగే బోనాల ఉత్సవాలు, తెలంగాణ గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం అని, లౌకిక స్ఫూర్తిని చాటుతాయని సీఎం వెల్లడించారు. బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న సుమారు మూడు వేలకు పైగా దేవాలయాల్లో అట్టహాసంగా

3లో


వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా?

బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?

అయితే రండి...






తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# బండి రమేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కర్కనాగరాజు



**కూకట్పల్లి ప్రతినిధి, జూలై 15 (వన్ నేషన్):** కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టిపిసిసి ఉపాధ్యక్షుడు, మరియు కమ్మ కార్పొరేషన్ చైర్మెన్ బండి రమేష్ జన్మదినోత్సవం కూకట్పల్లి ఎన్.కె.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగాయి. జన్మదినోత్సవాన్ని పు రస్కరించుకొని కూకట్పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు , హిందూస్తాన్ ఏరోనాటిక్స్ యూని యన్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు ఆధ్వర్యంలో బండి రమేష్ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల మాల తో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సేవ లో బండిరమేశ్ మరిన్ని పదవులు అధిరోహించాలని ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కర్కపెంటయ్య, హెచ్.ఎ.ల్ గుర్తింపు యూనియన్ ఉపాధ్యక్షుడు కుతాడి కృష్ణా, జాయింట్ సెక్రటరీ వద్దే నాగార్జున, పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై పీవీఎన్ఆర్ టీవీ వర్సిటీ అధికారుల వేధింపులు

**-సంబంధంలేని కేసుల్లో ఇరికించే కుట్ర - కోర్టు ఉత్తర్వులను సైతం అమలు చేయని వైనం -ప్రశ్నించే గొంతులను తొక్కివేస్తూ మారుమూలలకు బదిలీ - మీడియా సమావేశంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ ఆవేదన, ఆగ్రహం.**




**హైదరాబాద్ జూలై 15 (వన్ నేషన్):** ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని పి.వి.ఎన్.ఆర్. తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ (ప్రస్తుతం వి.ఆర్.ఎస్ తీసుకున్నారు) ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరి వ్యక్తుల ప్రోత్సాహబలంతో సంబంధం లేని కేసుల్లో ఇరికించే కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్రమ మార్గంలో నియమించిన ఇన్చార్జ్ అధికారులను వెంటనే తొలగించి, సీనియారిటీ ప్రకారం అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధికారులు కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించడం శోచనీయమన్నారు.

## అక్రమాలపై ప్రశ్నిస్తే బదిలీలు:

షెడ్యూల్డ్ కులం (మాదిగ)కు చెందిన తనపైనా, షెడ్యూల్డ్ తెగ (లంబాడ)కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్టెన్షన్ – ప్రస్తుతం సస్పెన్షన్లో ఉన్నవారు) లపైన, ప్రస్తుతం విధుల్లో ఉన్న మరో ప్రొఫెసర్పైన ఉద్దేశపూర్వక, నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్, రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ బి. ఉదయ్ కుమార్, పరిశోధనా విభాగం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. హరి కృష్ణ, ప్రొఫెసర్ డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ ఇ. సునీల్ ఆనంద్, నాన్–టీచింగ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీ షర్ఫుద్దీన్ కలిసి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇటీవల తిరిగి విధుల్లోకి చేరిన ప్రొఫెసర్ డాక్టర్ కె. వెంకట రమణ (వెటర్నరీ గైనకాలజీ ఒ అబ్స్టెట్రిక్స్ విభాగం) పై ఉద్దేశపూర్వక,నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారు. అక్రమాలపై ప్రశ్నించినందుకు జగిత్యాల జిల్లా కోరుట్ల (సీ. వి. ఎస్సీ ) లోని మారుమూల ప్రాంతానికి బదిలీ చేశారని తెలిపారు.

## రిజిస్ట్రార్ కీలక పాత్ర:

తనను వేధించడంలో రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర కీలక పాత్ర పోషించారని డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ ఆరోపించారు. ప్రొఫెసర్ సేవలందించిన తనపై మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. కొండల్ రెడ్డి, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ వి. లు కుట్ర పన్నుతున్నారని, రవీందర్ రెడ్డి కారణంగానే, 2017–2018లో నేను వరంగల్ జిల్లా మమ్నూర్ కె.వి.కె లో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్గా పనిచేస్తున్నప్పుడు తన ప్రొబేషన్ మరియు పదోన్నతి (ప్రమోషన్ ) నిలిపివేయబడ్డాయన్నారు. తన వల్లే తాను ఆయనకు జూనియర్గా మిగిలిపోయానన్నారు. వీరు (పి.వి.ఎన్.ఆర్. టీ.వీ.యు) లోని 'లైవ్స్టాక్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్మెంట్' విభాగంలోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్నానని, మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం బి. ఆర్ .ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సోదరుడినని వెల్లడించారు.

## చట్టవిరుద్ధం.. ఏకపక్ష చర్య:

పి.వి.ఎన్.ఆర్. టీ.వీ.యు మాజీ వైస్–ఛాన్సలర్ మరియు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బావమరిది అయిన డాక్టర్ రవీందర్ రెడ్డి, రిజిస్ట్రార్గా ఉన్న సమయంలో 2022లో ఫెబ్రేరులోని సి. ఎఫ్ .ఎస్. సి (కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్) అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్టెన్షన్) డాక్టర్ బాలాజీ గుగులోతును ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేశారు.గౌరవనీయులైన హైకోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోలేదని, ఇది చట్టవిరుద్ధం, ఏకపక్ష చర్య అని ఆధారాలో సహా ప్రసన్నకుమార్ వివరించారు. ఈ సమావేశంలో ప్రజా నాయకుడు సామాజికవేత్త క్రాంతికుమార్ , ఎమ్మార్పీఎస్ స్టేట్ నాయకుడు బోయ రమణ, ఎమ్మార్పీఎస్ లీడర్ రమేష్ ,దళిత మహిళ లీడర్ నికిత , ఓయూ లీడర్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

# బిల్డర్ల ఇష్టారాజ్యం.. పట్టణ ప్రణాళిక మౌనం

**- సీఎంసీకి కూతవేటు దూరంలోనే ఆరు అక్రమ నిర్మాణాలు! - ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా ఆరు అక్రమ నిర్మాణాలు! - సీఎంసీ కార్యాలయానికి సమీపంలోనే నిబంధనలకు తూట్లు - "అక్రమాలకు తావులేదు" అంటున్న కమిషనర్... క్షేత్రస్థాయిలో ఎందుకు కనిపించడం లేదు? - పట్టణ ప్రణాళిక అధికారుల నిర్లక్ష్యమా... లేక ఎవరికైనా అండదండలా? - చర్యలు లేకపోవడంతో బిల్డర్లకు మరింత ధైర్యం.**



**శేరిలింగంపల్లి జులై 15 అనిల్ రావు (వన్ నేషన్ ప్రతినిధి) :** నగరంలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎంసీ కమిషనర్ పదేపదే ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా కనిపిస్తోంది. అనుమతులు ఒక విధంగా తీసుకుని, నిర్మాణాలు మాత్రం మరో విధంగా చేపడుతున్న బిల్డర్ల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట పడటం లేదు. ముఖ్యంగా సీఎంసీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఏకంగా ఆరు నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అధికారుల కళ్ల ముందే ఈ నిర్మాణాలు అంతస్తుల మీద అంతస్తులు పెరుగుతున్నా, ఇప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సాధారణ ప్రజలు చిన్న నిబంధన ఉల్లంఘించినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, భారీ అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



అనుమతుల్లో చూపిన నమూనాకు పూర్తిగా భిన్నంగా నిర్మాణాలు సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సెట్బ్యాక్లు లేకుండా, అదనపు అంతస్తులు నిర్మించడం, అనుమతుల్లో లేని మార్పులు చేయడం వంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి స్పందన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సీఎంసీ కమిషనర్ అక్రమ నిర్మాణాలను ఏ మాత్రం సహించబోమని పలు సమావేశాల్లో స్పష్టం చేసిన నేపథ్యంలో, అదే కార్యాలయానికి సమీపంలో ఇలాంటి నిర్మాణాలు నిరంతరాయంగా కొనసాగుతుండటం అధికార యంత్రాంగ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కమిషనర్ ఆదేశాలు క్షేత్రస్థాయి అధికారులకు వర్తించవా? లేక ఆదేశాలు ఉన్నా అమలు చేయడం లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఈ నిర్మాణాలను గుర్తించలేదా? గుర్తించినా చర్యలు తీసుకోలేదా? లేక ఉద్దేశపూర్వకంగానే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. అధికారులు మౌనం పాటిస్తుండగా, బిల్డర్లు మాత్రం పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక డ్రైవ్లు నిర్వహిస్తున్నట్లు ప్రకటిస్తున్న అధికారులు, ఇలాంటి ప్రధాన ప్రాంతాల్లో జరుగుతున్న ఉల్లంఘనలను ఎందుకు విస్మరిస్తున్నారో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. చట్టం అందరికీ సమానమే అయితే, పెద్ద బిల్డర్ల విషయంలో మాత్రం ఎందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ అక్రమ నిర్మాణాల వెనుక ఎవరి అండ ఉంది? ఎవరైనా అధికారుల ఆశీస్సులు ఉన్నాయా? లేక తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలి

**- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి..**

**మంత్రాలయం: జులై 16 డి కాసిం వన్ నేషన్ ప్రతినిధి :** రాష్ట్రంలో ఎల్నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంటూ,ప్రభుత్వం పంటల వారీగా నిర్ణయించిన పంటల బీమా ప్రీమియాన్ని రైతులు చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించిన నేపథ్యంలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్పందించారు. ఇప్పటికే సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులపై పంటల బీమా ప్రీమియం భారం వేయడం సమంజసం కాదని ఆయన అన్నారు.గత ప్రభుత్వ హయాంలో కరోనా వంటి క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియాన్ని చెల్లించిందని గుర్తు చేశారు.రైతులకు అండగా ఉంటామని చెప్పిన ప్రభుత్వం,ప్రస్తుతం రైతులనే బీమా ప్రీమియం చెల్లించాలని కోరడం బాధాకరమని ఆయన



విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి,గతంలో అమలు చేసిన విధానాన్ని కొనసాగిస్తూ పంటల బీమా ప్రీమియాన్ని రైతులపై మోపకుండా ప్రభుత్వమే భరించాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి డిమాండ్ చేశారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

## హైకోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్




**యాదాద్రి జిల్లా : రామన్నపేట (వన్ నేషన్ ప్రతినిధి ):** విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అందుకు గురువుల సహకారం చదువులో తప్పక అవసరమని గురువు లేని విద్య గుడ్డి విద్య అని, క్రమశిక్షణ పట్టుదల తో బాగా చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు ఊరికి ఎంతో పేరు తెచ్చిన వారవుతారని ప్రముఖ హై కోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్ వారి సతీమణి జడ్చర్ల డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ గంజి సుకన్య అన్నారు. మునిపంపుల వాస్తవ్యులు మిర్యాల రవీందర్ తల్లిదండ్రులు మిర్యాల హరి గోవింద్ – జయ లక్ష్మీ సౌజన్యం తో మునిపంపుల ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు 700 నోటు పుస్తకాల ను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్య అతిథి సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, మాట్లాడుతూ ఉత్తమ పౌరులు గా రాణించాలంటే విద్య ఒక్కటే మార్గమని విద్యార్థులకు సూచించారు. మునిపంపుల లో చదువుకున్న ఉన్నత స్థాయిలో ఉన్నవారు మన విద్యార్థుల కోసం ఇలా ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల గెజిటెడ్. ప్రధానోపాధ్యాయులు దొడ్డిస్వామి. మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఇంకా 4 దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం రవీందర్ దంపతులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ళ క్రాంతి, AAPC చైర్మన్ బతిని వెంకటమ్మ, వార్డ్ మెంబర్ యదాసు లక్ష్మణ్, సేవా భారతి సంస్థ చైర్మన్ మన్నే పద్మా రెడ్డి, మాజీ సర్పంచ్ యదాసు యాదయ్య, మాజీ వీుూజ గాదె పారిజాత, పాఠశాల టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# సరూర్‌నగర్ డివిజన్‌లో సర్ ప్రక్రియను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్ సి. సుధాకర్




**ఎల్బీనగర్ , జూలై 15 (వన్ నేషన్ ప్రతినిధి):** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) – 2026 కార్యక్రమాన్ని సరూర్ నగర్ డివిజన్ స్పెషల్ ఆఫీసర్ సి. సుధాకర్ బుధవారం సరూర్‌నగర్ డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ఇంటింటి సర్వే, దరఖాస్తుల స్వీకరణ, నమోదు పనులు, హెల్ప్ డెస్క్‌ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా సర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వచ్చిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో సంబంధిత ఎన్నికల అధికారులు,ఎన్నికల సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# నేటి నుంచే బోనాలు

(1వ పేజీ తరువాయి)

నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కాగా హైదరాబాద్ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్–2026 కార్యక్రమం సందర్భంగా బుధవారం రాత్రి కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఫలక్‌నుమా ప్యాలట?సలో అధికారిక విందును ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి మన్‌సుఖ్‌మాండవియాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా, ఇండోనేసియా, చైనా, రష్యా, ఇరాన్, ఇథియోపియా, యూఏఈ, బ్రెజిల్ దేశాల మంత్రులను సీఎం రేవంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వివేక్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీఎంవో స్పెషల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, డీజీపీ సీ.వీ.ఆనంద్, కార్మిక శాఖ కార్యదర్శి దాసరి.హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్‌కు ప్రముఖుల ఆహ్వానం

(1వ పేజీ తరువాయి)

గేట్ ఎదురుగా) జరగనున్నాయి. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బాగేశ్వర్ ధామ్ నుంచి 60 మంది సభ్యుల బృందం, అలాగే ఇతర ప్రాంతాల నుంచి 500 మంది రానున్నారు. వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జూలై 16 నుంచి 19 వరకు స్వచ్ఛంద సేవకులు విధుల్లో ఉండాలని సూచించారు. సేవలం దించిన ప్రతి స్వచ్ఛంద సేవకునికి 'బాబా' తరపున ప్రత్యేక ప్రశంసాపత్రం (సర్టిఫికేట్) అందిస్తామన్నారు.

17న హైదరాబాద్‌కు పూజ్య బాబా : జూలై 17న పూజ్య బాబా హైదరాబాద్‌కు చేరుకుంటారని, ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 6 వరకు శ్రీ హనుమాన్ కథ నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. రెండో రోజు శ్రీ హనుమాన్ కథతో పాటు దివ్య దర్బార్ కూడా నిర్వహిస్తామన్నారు. ఇందులో బాబా భక్తుల సందేహాలకు, ప్రశ్నలకు సమాధానాలు అందిస్తారు. ప్రతి స్వచ్ఛంద సేవకునికి మూడు రోజుల కోసం మూడు వేర్వేరు రంగుల స్కార్ఫ్‌లు, ఒక ఐడీ కార్డు అందిస్తారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లో క్రమశిక్షణతో, ఆదర్శప్రాయంగా సేవలు అందించాలని సూచించారు. సేవ చేయాలనుకునే భక్తుల కోసం కార్యక్రమ ప్రాంగణంలో ప్రత్యేక సేవా నమోదు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగహారంగా అపోలో, ఏఐజీ ఆసుపత్రులు ఆరోగ్య సేవలను అందించనున్నాయి. రక్తపోటు, మధుమేహ పరీక్షలు, కంటి పరీక్షలతో కూడిన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలను కూడా అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

# రైతులకు క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

## - క్రాప్ ఇన్సూరెన్స్ ప్రక్రియ గడువును పెంచాలి- మాజీ ఎంపీ బుట్టా రేణుక



**ఎమ్మిగనూరు, జులై 15 (వన్ నేషన్):** రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలని, క్రాప్ ఇన్సూరెన్స్ ప్రక్రియ చేసుకునే గడువును పెంచాలని మాజీ ఎంపీ బుట్టా రేణుక పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని హెచ్బీఎస్ కాలనీలో వైయస్సార్సీపి కర్నూల్ పార్లమెంటరీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుత టీడీపీ--కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమ విధానాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతు భరోసా కేంద్రాల (RBK) ద్వారా గ్రామ స్థాయిలోనే రైతులకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సేవను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంట నమోదు (e-Crop), రైతు బీమా, పంట నష్టపరిహారం, వ్యవసాయ సలహాలు, మార్కెటింగ్ సేవలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారానే పారదర్శకంగా అందించబడేవని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేదని, గ్రామంలోనే అన్ని సేవలు అందుబాటులో ఉండడంతో రైతు సమయం, శ్రమ, డబ్బు ఆదా అయ్యేవని చెప్పారు. రైతును గౌరవించిన ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వమైతే, రైతును అవమానిస్తున్న ప్రభుత్వం నేటి టీడీపీ--కూటమి ప్రభుత్వమని తీవ్రంగా విమర్శించారు. నేడు రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో రైతులు మీ సేవా కేంద్రాల వద్ద తెల్లవారుజామున నుంచే క్యూల్లో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఒకరోజు ప్రకటన చేసి మరుసటి రోజే వెబ్‌సైట్ నిలిపివేయడం, సాంకేతిక లోపాల వల్ల వేలాది మంది రైతులు పంట నమోదులు పూర్తి చేయలేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతుల విలువైన సమయాన్ని వృథా చేస్తూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం రైతు వ్యతిరేక పాలనకు నిదర్శనమని అన్నారు. గతంలో రైతు బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించేదని, ఇప్పుడు మాత్రం బీమా పేరుతో రైతులపై అదనపు ఆర్థిక భారం మోపడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని భారంగా మార్చడం కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన టీడీపీ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. రైతులకు ఇంకా మెరుగైన బీమా, మరింత మేలు చేస్తాం అని చెప్పి నేడు రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె అన్నారు. మూడు రాజధానులను వ్యతిరేకించిన వారే ఇప్పుడు అభివృద్ధి పేరుతో కొత్త కొత్త మాటలు చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అప్పుడే కారిడార్ ఆధారిత అభివృద్ధి ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు కల్పించే దూరదృష్టితో ముందుకు వచ్చారని, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు విస్తరించే ఆ విజన్‌ను అడ్డుకున్నవారే ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.

రైతు పక్షపాతి ప్రభుత్వం మాది అని ఎన్నికల సమయంలో చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నేడు రైతులను క్యూల్లో నిలబెట్టి, కార్యాలయాల చుట్టూ తిప్పుతూ, అదనపు ఆర్థిక భారం మోపుతూ రైతులను నట్టేట ముంచే విధానాలను అమలు చేస్తున్నారని బుట్టా రేణుక తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా నేను వారి పక్షాన నిలబడతాను. రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతాను. రైతు కన్నీరు తుడవడమే మా లక్ష్యం. రైతు ప్రయోజనాలను కాపాడే వరకు మా పోరాటం ఆగదు అని స్పష్టం చేశారు.

అనంతరం బుట్టా ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. ప్రజలకు సేవ చేయడం తమ కుటుంబ సంప్రదాయమని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉండటమే బుట్టా ఫౌండేషన్ ధ్యేయమని తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు వేచి చూడకుండా, అవసరం ఉన్న వెంటనే ప్రజలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. ఎండల తీవ్రత, వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉందని సమాచారం అందిన వెంటనే బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకర్లను పంపించి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఒక్క గ్రామం కూడా తాగునీటి కొరతతో ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తున్నామని చెప్పారు

తాగునీరు ప్రతి మనిషి ప్రాథమిక హక్కు అని, ప్రజలు ఒక బిందె నీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. అలాంటి ఇబ్బందులు ప్రజలకు కలగకుండా బుట్టా ఫౌండేషన్ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట వెంటనే స్పందించి సేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చడం కంటే గొప్ప సామాజిక సేవ మరొకటి లేదనే భావనతో ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు.రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు సహా ప్రతి వర్గానికి అవసరమైన సమయంలో అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను కేవలం మాట్లాడటానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి ప్రత్యక్షంగా కృషి చేయడమే తమ విధానమని స్పష్టం చేశారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా గతంలో అందించిన అన్ని సేవలను యథాతథంగా పునరుద్ధరించాలని, రైతు బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించాలని, పంట నమోదు ప్రక్రియను సులభతరం చేసి రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, యువ నాయకులు బనవాసి బసిరెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుబాబు తదితర నాయకులు పాల్గొన్నారు

# విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందాలి

## - ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం

**ఎమ్మిగనూరు, జులై 15 (వన్ నేషన్):** విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వీవర్స్ కాలనీ) ప్రధానోపాధ్యాయులు నాగభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు, క్విజ్ పోటీలు, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణ రెడ్డి విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు వృత్తి నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందగలుగుతారని, నైపుణ్య విద్య యువతకు విజయానికి బాటలు వేస్తుందని తెలిపారు.విద్యార్థులు డ్రాయింగ్, క్విజ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. డ్రాయింగ్ పోటీలో 8వ తరగతి విద్యార్థిని జి. అక్షిత ప్రథమ బహుమతిని సాధించింది. అనంతరం ప్రధానోపాధ్యాయులు నాగభూషణ రెడ్డి, సీనియర్ అధ్యాపకులు , ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఎం. ఈరన్న, సుధాకర్, సునీత, రామ్ మోహన్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. డ్రాయింగ్ పోటీల నిర్వహణలో డ్రాయింగ్ మాస్టర్ వి. నాగరాజా రావు ప్రత్యేక సహకారం అందించారు.వృత్తి విద్య శిక్షకులు కె. వంశీ, శ్రీహరి, వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సామాజిక వివక్ష పేరుతో దళితులపై దాడులు అర్థరహితం

**ఎమ్మిగనూరు, జులై 15 (వన్ నేషన్):** సామాజిక వివక్ష పేరుతో దళితులపై దాడులు అర్థరహితమని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. దేవ సహాయం, సిఐటియు అధ్యక్షులు పి. గోవిందు పేర్కొన్నారు. బుధవారం సామాజిక శంఖారావం ఎమ్మిగనూరు మండల సదస్సు కెవిపిఎస్ ఆఫీసులో కెవిపిఎస్ మండల కార్యదర్శి తిమ్మన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. దేవ సహాయం, సిఐటియు అధ్యక్షులు పి. గోవిందు మాట్లాడుతూ సామాజిక శంఖారావం పేరున గ్రామీణ ప్రాంతాలలో దళితులపై వివక్షత పేరుతో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను తీవ్రంగా ఖండిస్తూ ఆగస్టు నుండి సెప్టెంబర్ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వివక్షతను, వాటి రూపాలను దళాల వారిగా సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వతంత్ర అనంతరం నేటికీ గ్రామీణ ప్రాంతాలలో పట్టణాలలో దళితుల పట్ల వివక్షత కొనసాగుతుందని వారు ఆరోపించారు. గ్రామాలలో త్రాగునీరు, హోటలలో, బార్బర్ షాపులలో, ఊరి చావిడిలలో, రచ్చబండ కట్టలలో నేటికీ దళితులను దూరంగా ఉంచటం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాజ్యాంగం ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కులను కల్పించిందని తెలియజేశారు. అగ్రవర్ణాల పెత్తందారులు, భూస్వాములు నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో వివక్షతను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల పట్ల వివక్షతను నిర్మూలించడంలో ఘోరంగా వైఫల్యం చెందారని ఆరోపించారు. కేవలం ఎన్నికల్లో అధికారం కోసం మాత్రమే దళితుల పట్ల కపటి ప్రేమనుకనపరుస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ మనువాద ధర్మశాస్త్రం సిద్ధాంతాలను అమలు జరపడానికి శాయశక్తుల కృషి చేస్తున్నాయని అన్నారు .ఈకార్యక్రమంలో ధరసం వ్యవస్థాపక అధ్యక్షులు భాస్కర్, సిఐటియు కార్యదర్శి రాముడు, యుటిఎఫ్ నాయకులు మల్లారి నాగరాజు, గుమ్మల బాబు, రైతు సంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసయ్య, చర్మ కళాకారుల సంఘం సంఘం జిల్లా కార్యదర్శి సుమాల ఆందోని, చేనేత కార్మిక సంఘం కార్యదర్శి భరణి కాలప్ప, కెవిపిఎస్ నాయకులు కలగొట్ల రాజా రమేష్,చిన్నప్ప, సుమాల రాజు, గుడికల్ ఆనందు, కుమార్, రాజు, ఏసన్న ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.




# మొబైల్ ను అందజేసి నిజాయితీని చాటుకున్న అధ్యాపకుడు

**యాదాద్రి జిల్లా : రామన్నపేట (వన్ నేషన్ ప్రతినిధి):** నల్లగొండ నుండి భువనగిరికి బయలుదేరుతున్న బస్సులో ఉదయం 9 గంటల ప్రాంతంలో చిట్యాల ప్రాంతానికి చెందిన చంద్రు అనే వ్యక్తి తన మొబైల్ ను మరచిపోగా అదే బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో పనిచేస్తున్న గ్రంథపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీనుకు లభించింది. మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలను ఆరా తీసి మరల ఆ వ్యక్తికి శ్రీను అందజేయడం జరిగింది.వంద రూపాయలు దొరికితేనే ఎవరికీ చెప్పకుండా జేబులో వేసుకొని పోయే వ్యక్తులు ఉన్న ఈ రోజుల్లో సుమారు 15000 విలువ చేసే మొబైల్ లభించినప్పటికీ దానిని నిజాయితీగా మళ్లీ ఆ వ్యక్తికి అందజేయడం గొప్ప విషయమని పలువురు శ్రీనును అభినందించారు. అభినందించినవారిలో కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం, అధ్యాపకులు ఉన్నారు.



# ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు

**కూకట్‌పల్లి ప్రతినిధి, జులై 15 (వన్‌నేషన్):** కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ జన్మదిన వేడుకలు కూకట్పల్లి వై-జంక్షన్ సమీపంలోని ఎన్‌కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కి ఘన సన్మానంతో గజమాలతో శాలువాలతో సన్మానించి అభినందనలు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి బంధువులు, స్నేహితులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని అందరి బంధువు, జనహృదయ నేత బండి రమేష్ ని సన్మానించి, జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా చేశారు. తదనంతరం ఏర్పాటు ఏర్పాటుచేసిన భోజనం కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా బండి రమేష్ కి వసంత నగర్ డివిజన్ కార్యకర్తలు నాయకులుజన్మదినశు భాకాంక్షలుతెలిపారుమూసాపేట్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎమ్ఎ. చున్నుపాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బండి రమేష్ కేక్ కట్ చేశారు. పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయనకు



శాలువాతో సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిలారు శ్రీనివాస బాబు,చావా శ్రీనివాసరావు, మాకినేని యాకనారాయణ (వినోద్)- విజయలక్ష్మి, వసంత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కూకట్పల్లి నియోజకవర్గం కమ్మ సంఘం వైస్ చైర్మన్ పరుచూరి మురళి , తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన

# "ర్యాప్జ్ ఎన్ ఫ్రైజ్" మూడో బ్రాంచ్

**- ఫ్రెష్ ర్యాప్స్... లోడెడ్ ఫ్రైజ్... అంతర్జాతీయ రుచులను హైదరాబాద్‌కు పరిచయం చేస్తున్న యువ పారిశ్రామికవేత్తలు - నాణ్యతలో రాజీ లేదు... పరిశుభ్రతే మా ప్రాధాన్యం... వినియోగదారుల సంతృప్తే మా విజయం -- వ్యవస్థాపకులు**







**హైదరాబాద్, జులై 15(వన్ నేషన్):** నగరంలోని ఫుడ్ లవర్స్‌కు వినూత్నమైన రుచులను పరిచయం చేస్తూ ప్రముఖ ఫుడ్ బ్రాండ్ "ర్యాప్జ్ ఎన్ ఫ్రైజ్ (Wrapz N Fryz -- Fresh Wraps, Loaded Fryz) తన మూడో బ్రాంచ్‌ను బంజారాహిల్స్, రోడ్ నెం.3, జర్నలిస్ట్ కాలనీలో ఘనంగా ప్రారంభించింది. అత్యాధునిక ఇంటీరి యర్, పరిశుభ్రమైన వంటశాల, అంతర్జాతీయ ప్రమాణా లతో కూడిన మెనూ, కుటుంబ సభ్యులు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు అందరికీ అనువైన వాతావరణం తో ఈ అవుట్‌లెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సంస్థను యువ పారిశ్రామికవేత్తలు కందూరి రంజిత్, విజయ్ పులికొండ, సురేష్ బతుల భాగస్వామ్యంతో స్థాపించారు. ఈ సందర్భంగా విజయ్ పులికొండ మాట్లాడుతూ, ఫుడ్ రంగంలో దాదాపు తొమ్మిదేళ్ల అనుభవంతో వినియోగదారులకు అత్యుత్తమ రుచి, నాణ్యత, పరిశుభ్రతను అందించాలనే సంకల్పంతో ఈ ప్రయాణాన్ని ప్రారంభించామని తెలిపారు. కూకట్‌పల్లి, జేఎన్‌టీయూలో లభించిన విశేష ఆదరణతో ఇప్పుడు నగరంలోని ప్రధాన ప్రాంతమైన బంజారాహిల్స్‌లో మూడో బ్రాంచ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.

జూబ్లీహిల్స్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, అమీర్‌పేట్, బంజారాహిల్స్ ప్రాంతాల ప్రజలకు ఈ అవుట్‌లెట్ సులభంగా చేరుకునేలా ఉండటంతో పాటు కళాశాల విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులు సేదతీరుతూ రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదించేందుకు ఇది ఉత్తమమైన ప్రదేశంగా నిలుస్తుందని తెలిపారు. మార్కెట్లో సాధారణంగా లభించే ఫ్రైజ్‌లకు భిన్నంగా, డచ్ స్టైల్ లోడెడ్ ఫ్రైజ్, ప్రత్యేక రుచులతో కూడిన సిగ్నేచర్ ర్యాప్స్, ప్రీమియం మొజిటోలు, థిక్ షేక్స్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఆహార పదార్థాన్ని నాణ్యమైన ముడి పదార్థాలతో, అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తున్నామని వివరించారు. సంస్థ భాగస్వామి సురేష్ బతుల మాట్లాడుతూ, తమ వద్ద 12 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన చెఫ్స్, ఫుడ్ మాస్టర్స్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి వంటకం రుచి మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని తయారు చేస్తామని చెప్పారు. వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమకు అత్యంత ముఖ్యమని, నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. ముగ్గురు భాగస్వాములు మాట్లాడుతూ, "మా దృష్టిలో వినియోగదారుడే దేవుడు. అందుకే ప్రతి వంటకాన్ని ప్రేమతో, శ్రద్ధతో, నాణ్యమైన పదార్థాలతో తయారు చేసి అందిస్తున్నాం. ఒక్కసారి మా రుచిని ఆస్వాదిస్తే మళ్లీ మళ్లీ రావాలనిపించేలా సేవలు అందిస్తాం. పరిశుభ్రమైన వంటశాల, ఉత్తమమైన సర్వీస్, సరసమైన ధరల్లో ప్రీమియం రుచులు అందించడం మా లక్ష్యం" అని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ అవుట్‌లెట్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రాండ్ లాంచ్ సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక వాల్యూ మీల్ ఆఫర్‌ను ప్రకటించారు. జూలై 31 వరకు మాత్రమే రూ.299కే ఒక సిగ్నేచర్ ర్యాప్, ఒక సిగ్నేచర్ లోడెడ్ ఫ్రైజ్, ఒక థిక్ షేక్ లేదా మొజిటో అందిస్తున్నట్లు వెల్లడించారు. చివరగా వ్యవస్థాపకులు కందూరి రంజిత్, విజయ్ పులికొండ, సురేష్ బతుల మాట్లాడుతూ, "ఫ్రెష్ ర్యాప్స్... లోడెడ్ ఫ్రైజ్... ప్రీమియం రుచి... అత్యుత్తమ నాణ్యత" అనే భావనతో ప్రారంభించిన ర్యాప్జ్ ఎన్ ఫ్రైజ్‌ను ప్రతి ఒక్కరూ సందర్శించి విభిన్నమైన రుచులను ఆస్వాదించాలని ఆహ్వానించారు. "రుచి కోసం వస్తారు... నాణ్యత కోసం మళ్లీ మళ్లీ వస్తారు" అనే నినాదంతో వినియోగదారుల ఆదరణను పొందేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**

# జూలై 18న సరూర్‌నగర్‌లో నిర్వహించే బీఆర్ఎస్ "యువ సంగ్రామ సభ"ను విజయవంతం చేయాలి

**హైదరాబాద్, జులై 15 (వన్‌నేషన్):** నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సభ" ఏర్పాట్లలో భాగంగా సభా వేదిక నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, శంబిపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు, మాజీ చైర్మన్లు మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా సభకు సంబంధించిన వేదిక నిర్మాణం, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షించి సంబంధిత కమిటీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా



నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభను విజయవంతం చేసి, నిరుద్యోగ యువత గొంతుకను ప్రభుత్వానికి బలంగా వినిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

**- ముఖ్యమంత్రి వెంటనే చొరవ తీసుకుని పరిష్కరించాలి - సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి - సమాచార్ భవన్ ఎదుట నిరసన లో TWJF డిమాండ్**



**హైదరాబాద్, జులై 15(వన్ నేషన్):** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ట౧జేఫ్) డిమాండ్ చేసింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. నిత్యం అష్ట, కష్టాలను అనుభవిస్తున్న పాత్రికేయుల ఇబ్బందులను మానవతా దృక్పథంతో అర్థంచేసుకుని యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం హైదరాబాద్ లోని మసాబ్ ట్యాంక్ లో ఉన్న సమాచార శాఖ కమిషనరేట్ ఎదుట ట౧జేఫ్ బహిరంగ నిరసన వ్యక్తం చేసింది. వందలాది మంది జర్నలిస్టులు హాజరై...తమ సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఉచిత ఆర్టీసీ బస్సు, మెట్రో రైలు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ ఎం ఎ సి చైర్మన్ గా ఉన్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అక్రిడిటేషన్ కార్డుల జారీ లో పక్షపాతం చూపుతున్నారని ఫెడరేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేసారు. అర్హులైన జర్నలిస్తులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ల పేర విభజన రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. జర్నలిస్టుల పట్ల వివక్ష చెల్లదని స్పష్టం చేసారు. మీడియా అకాడమీ జర్నలిస్టులు అందరి తరపున బాధ్యత తీసుకోవాలని సూచించారు. వివక్షకు తావులేకుండా మీడియా అకాడమీ శిక్షణా తరగతులు నిర్వహించాలని కోరారు. స్టేట్ లెవెల్ అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో దరఖాస్తులు తిరస్కరించి.. తరువాత తమకు నచ్చిన వారికే కార్డులు ఇవ్వడాన్నీ ఫెడరేషన్ తప్పు పట్టింది. ప్రజా స్వామ్య వ్యవస్థలో నియంతృత్వం చెల్లదని హెచ్చరిం చింది. ధర్నాకు అధ్యక్షత వహించిన ఫెడరేషన్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి బసవపున్న య్య మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కమిటీ ల్లో అనధికారికంగా నియమించిన



వారిని తొలగించాలనీ, ఈ విషయం పై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పదవుల్లో ఉన్న పెద్దమనుషులు మీడియా కు, ప్రభుత్వానికి గుర్తింపు వచ్చేలా వ్యవహరించాలి కానీ, బద్నాం చేసేలా నడుచుకోవద్దాని ఫెడరేషన్ హితవు పలికింది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టుగా ఫ్యూచర్ సిటీ లో ఇండ్ల స్థలాల ప్రక్రియ ను ప్రారంభించాలనీ, క్యాబినెట్ సబ్ కమిటీకి తగిన ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రిని ఫెడరేషన్ నాయకులు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఉచితంగా ఆర్టీసీ బస్సు, మెట్రో రైలు పాసులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే పాసుల పునరుద్ధరణకు సంబంధించి కేంద్రం పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలనీ, ప్రధానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని కోరారు. నిరసన కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి జర్నలిస్టులు హాజరయ్యారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, తాటికొండ కృష్ణ, బి రాజశేఖర్, కార్యదర్శి ఇ చంద్రశేఖర్, సలీమ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం సరికాదనీ, ముఖ్యమంత్రి వెంటనే చొరవ తీసుకుని పరిష్కరించాలన్నారు. డీజే ఎఫ్ టి ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ, డెస్క్ జర్నలిస్టులకు పూర్తి స్థాయిలో అక్రిసిటేషన్లు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యక్షులు గుడిగ రఘు, కార్యదర్శులు గంద్ర నవీన్, మాణిక్ ప్రభు, సలీమా, నిరంజన్, వెంకటేష్, దామోదర్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, శ్రీనివాస రెడ్డి, నాయకులు దువ్వా సాగర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శేరిబాయి గణేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లేష్ గౌడ్, రవి నాయక్, నాయకులు హరి ప్రసాద్, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఐ రాంబాబు, బి రాంబాబు,నాగర్ కర్నూల్ కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు రాంచందర్, వనపర్తి అధ్యక్షుడు రాము, నాయకులు జ్ఞానేశ్వర్, జోగులాంబ గద్వాల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు జాన్, నాయకులు రంగముని, ఎఖజీ అధ్యక్షులు బి అరుణ్ కుమార్, ఫెడరేషన్ నాయకులు దొంతి వినోద్ కుమార్ గౌడ్, శశికళ, విజయ, మణిమాల. రాణి, రేనయ్య, భాస్కర్, జే ఎన్ జే నాయకులు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఐటీ రంగాన్ని సర్వనాశనం చేస్తున్న రేవంత్ రెడ్డి అసమర్థ పాలన

**- ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు ధ్వజం - కేటీఆర్ విజన్‌తో 9.46 లక్షల ఉద్యోగాలకు చేరిన ఐటీ రంగం.. రేవంత్ రెడ్డి హయాంలో వెనకడుగు! - హైదరాబాద్‌ను వదిలి వైజాగ్‌కు తరలిపోతున్న 'కాగ్నిజెంట్'.. 20 వేల ఉద్యోగాల నష్టంపై సీఎం సమాధానం చెప్పాలి - పరిశ్రమల దగ్గర 'కన్‌స్ట్రక్షన్ డెబ్రిస్' కుప్పలు.. హైటెక్ సిటీని చెత్త సిటీగా మార్చిన ఘనత రేవంత్ రెడ్డిదే - నిరుద్యోగులను ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆర్ఆర్ టాక్స్, కమిషన్ల వల్లే పక్క రాష్ట్రాలకు తరలిపోతున్న కంపెనీలు.**



**హైదరాబాద్, జులై 15 (వన్‌నేషన్):** గడచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, కేటీఆర్ గారి నాయకత్వంలో అంతర్జాతీయ ఐటీ హబ్‌గా, ఫార్మా, వ్యాక్సిన్ డెవలప్‌మెంట్ కేంద్రంగా మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లిన హైదరాబాద్ ప్రతిష్టను ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా మంటగలుపుతోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ భవిష్యత్తును, ఐటీ రంగాన్ని, నిరుద్యోగ యువత ప్రయోజనాలను రేవంత్ రెడ్డి తన అసమర్థతతో సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రోజు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడిన ముఖ్యాంశాలు: బీఆర్ఎస్ సాధించిన ప్రగతి ప్రస్థానం వర్సెస్ కాంగ్రెస్ విధ్వంసం గత ప్రభుత్వ హయాంలో ఐటీ రంగం సాధించిన అద్భుతమైన వృద్ధిని డా. శ్రవణ్ సంఖ్యలతో సహా నిరూపించారు: ఐటీ ఎగుమతులు (Exports): 2013-14లో కేవలం 57,258 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు, కేటీఆర్ గారి సమర్థత, విజన్ వల్ల బీఆర్ఎస్ దిగిపోయే నాటికి ఏకంగా 2,68,223 కోట్లకు చేరాయి. ఉద్యోగాల కల్పన: 2013-14లో 3 లక్షల పైచిలుకు ఉన్న ఐటీ ఉద్యోగాల సంఖ్య, 2023-24 నాటికి 9,46,000 ఉద్యోగాలకు పెరిగింది. ఏటా సగటున 60 వేల కొత్త ఐటీ ఉద్యోగాలు వచ్చాయి. ఉద్యోగాల కోత: కానీ, ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్తున్న లెక్కల ప్రకారమే 2026 నాటికి ఐటీ ఉద్యోగాల సంఖ్య 9,39,000 మాత్రమే ఉంది. అంటే రేవంత్ రెడ్డి పాలనలో కొత్త ఉద్యోగాలు రాకపోగా, ఉన్న 7,000 ఉద్యోగాలను మింగేసిన బకాసురుడిలా ఈ ప్రభుత్వం తయారైంది. కేటీఆర్ గారు ఏటా 60 వేల ఉద్యోగాలు కల్పిస్తే, రేవంత్ రెడ్డి ఏటా 7 వేల ఉద్యోగాలను తినేస్తూ.. మొత్తం మీద లక్షా 27 వేల ఉద్యోగాల అవకాశాలను నష్టం చేశారు.

### హైదరాబాద్‌ను వీడుతున్న దిగ్గజ సంస్థలు -- ఎవరిది బాధ్యత?

ఆదిబట్ల, నానక్‌రామ్‌గూడ సెజ్‌లలో దాదాపు 15 నుండి 20 వేల ఉద్యోగాలు కల్పించాల్సిన అంతర్జాతీయ ఐటీ దిగ్గజం 'కాగ్నిజెంట్' (Cognizant) ఇవాళ హైదరాబాద్‌ను వదిలి విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్) తరలిపోతోందని డా. శ్రవణ్ ఆందోళన వ్యక్తం చేశారు. "విశాఖపట్నంలో ఉన్న అట్రాక్షన్ ఏంది? అక్కడ ఐటీ శాఖ మంత్రి లోకేష్ గారి దగ్గర ఉన్న మంత్రదండం ఏంది? రేవంత్ రెడ్డి దగ్గర లేనిది ఏంది? దావోస్ పోయి ఐటీ అంటే 'న్యూక్లియర్ చైన్ రియాక్షన్' అని మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి చేతగానితనం వల్లే ఈ సంస్థలు తరలిపోతున్నాయి.దీని వెనుక ఏమైనా ఆర్ఆర్ (RR) టాక్స్ కమీషన్ల వ్యవహారం ఉందా? కేంద్ర ప్రభుత్వం దీనికి ఎలా అనుమతి ఇచ్చింది? బడే బాయి, చోటే బాయి అని నరేంద్ర మోడీ చుట్టూ తిరిగే రేవంత్ రెడ్డి ఎందుకు కాగ్నిజెంట్‌ను ఇక్కడే ఉంచలేకపోయారు?" అని ఆయన ప్రశ్నించారు. ఇదే కాకుండా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కార్నింగ్ గ్లాస్, ప్రీమియర్ ఎనర్జీస్, కెయిన్స్ టెక్నాలజీ వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు రాష్ట్రం దాటిపోయాయని గుర్తుచేశారు.

### హైటెక్ సిటీ కాస్త 'డెబ్రీస్ (చెత్త) సిటీ'గా మారింది

ఒకప్పుడు కేటీఆర్ గారి హయాంలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ దాటి ఐటీ కారిడార్‌లోకి వెళ్తుంటే న్యూయార్క్, కాలిఫోర్నియా డౌన్‌టౌన్‌లోకి వెళ్లిన అనుభూతి కలిగేదని, కానీ నేడు రేవంత్ రెడ్డి మున్సిపల్ మంత్రిగా ఉన్న నిర్లక్ష్యం వల్ల ఐటీ కారిడార్ అంతా నిర్మాణ వ్యర్థాలు (జశీఅర్‌తీబష్‌ఱశీఅ ణవఎతీఱవం), చెత్త కుప్పలతో నిండిపోయిందని విమర్శించారు. గత ఆరు నెలలుగా ఐటీ కంపెనీల మధ్య జవహర్‌నగర్ తరహా డంప్‌యార్డ్ తయారవుతుంటే, విదేశీ పెట్టుబడిదారులు ఎలా వస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కనీసం పని కూడా చేయనివ్వకుండా సీఎం అన్నిటిలో వేలు పెడుతున్నారని ఆరోపించారు.

### ఏఐ పై స్పష్టత ఏది? రిహాబిలిటేషన్ ప్లాన్ ఎక్కడ?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వల్ల ఉద్యోగాలు పోతాయని సీఎం రేవంత్ రెడ్డి భయపెడుతున్నారే తప్ప, తెలంగాణలోని లక్షలాది మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగుల సంరక్షణ కోసం ప్రభుత్వం వద్ద ఉన్న రోడ్ మ్యాప్ ఏంటో చెప్పడం లేదన్నారు. ఏఐ సవాళ్లను ఎదుర్కొనేందుకు బడ్జెట్ కేటాయింపులు గానీ, స్పష్టమైన ప్రణాళిక గానీ ఈ ప్రభుత్వానికి లేవని విమర్శించారు.

### ఉద్యోగాల భర్తీపై మోసం -- విద్యార్థులపై లాఠీఛార్జ్

ఒక్క సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నెలకు ?4000 నిరుద్యోగ భృతి అని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల ఖాళీలు ఉంటే కేవలం 5 వేలకు నోటిఫికేషన్ ఇచ్చి, మిగిలిన 10 వేల పోస్టుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులను గొడ్లను బాదినట్టు బాదించారని, పైగా ఎన్‌కౌంటర్ల పేరుతో బెదిరిస్తున్నారని మండిపడ్డారు.

### మీడియాకు, ప్రజలకు విజ్ఞప్తి:

రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, తెలంగాణ ఐటీ రంగాన్ని సర్వనాశనం చేస్తూ, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ హిట్లర్ తరహా నియంతృత్వ పాలన సాగిస్తున్నారని డా. శ్రవణ్ దాసోజు ధ్వజమెత్తారు. మీడియా మిత్రులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి ఐటీ కారిడార్‌లోని దుస్థితిని పరిశోధనాత్మకంగా ప్రజల ముందుకు తీసుకురావాలని, తెలంగాణ భవిష్యత్తు కోసం ఈ ప్రభుత్వ తప్పిదాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు.